ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది:27.04.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ శాసన మండలి సభ్యులుగా కాంగ్రెస్ నుంచి అజారుద్దిన్, ప్రొఫెసర్ కోదండరాం ఈ ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు.

2. రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అయిన ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

3. ఎలాంటి కుటుంబ నేపథ్యంలేని ఆఫ్టర్ కేర్ కేంద్రానిక చెందిన విద్యార్థులకు అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలను ప్రభుత్వం అందిస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.

4. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకుంటున్నారు.

**ప్రమాణ స్వీకారం**

తెలంగాణ శాసనమండలి నూతన సభ్యులుగా మంత్రి అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరాం ఈ ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారిద్దరితో ప్రమాణ స్వీకారం చేయించారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎంపికైన వీరి ప్రమాణ స్వీకార ఉత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

పిటిసి, హైదరాబాద్

**ప్రజావాణి**

రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అయిన ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లో నిన్న జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులకు ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు వచ్చే అవసరం లేకుండా వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని, తదుపరి దశలో మండల స్థాయికి విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదు నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపాలని, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ వేదిక అభివృద్ధి చేయాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని ఆదేశించారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు.

డెస్క్

**సీతక్క**

హైదరాబాద్, ప్రజా భవన్‌లో ఈరోజు ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా 'చైల్డ్ సేఫ్టీ ప్రొటెక్షన్ - సే నో టు డ్రగ్స్' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.. ఎలాంటి కుటుంబ నేపథ్యం లేని ఆఫ్టర్ కేర్ విద్యార్థులకు ఆధార్ కార్డు, నివాస, ఆదాయ, కుల తదితర ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇప్పటి వరకు ప్రభుత్వ సంరక్షణలో ఉన్న ఆఫ్టర్ కేర్ పిల్లలు ఇకపై స్వతంత్ర జీవితంలోకి అడుగుపెడుతున్నారని తెలిపారు. వారి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం స్వయంగా అందజేస్తోందని చెప్పారు. మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మంత్రి

సూచించారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొంటూ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేయడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించారు.

డెస్క్

**జనగణన ఖమ్మం**

జనగణన -2027 లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఈరోజు ఖమ్మం ప్రజాభవన్ క్యాంప్ కార్యాలయంలో స్వీయ జనగణన కార్యక్రమంలో వెబ్ సైట్ ద్వారా ఆయన తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనగణన ప్రణాళిక, సుపరిపాలన, వనరుల సమాన పంపిణీకి పునాది అని, దీని ద్వారా అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరుతాయని పేర్కొన్నారు.

పిటిసి, ఖమ్మం

**ప్రధాని టూర్**

వచ్చే నెల పదవ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ పర్యటనకు రానున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మూడోసారి దేశ ప్రధాని బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇది ప్రధానమంత్రి మోదీ తొలి తెలంగాణ పర్యటన కావడం విశేషం. ఈ పర్యటన సందర్భంగా రాష్ట్రంలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యంగా పలు రైల్వే స్టేషన్లను జాతికి అంకితం చేయడంతో పాటు, జాతీయ రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. అలాగే, హైదరాబాద్ నగరంలోని పరేడ్ గ్రౌండ్స్ లో ప్రధాని మోదీ భారీ ప్రజాసభలో పాల్గొంటారు.

డెస్క్

**అడ్లూరి**

చండీగఢ్‌లో నిర్వహించిన చింతన్ శివిర్ లో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ

సదస్సులో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి లక్ష్మణ్ కుమార్, తెలంగాణ ప్రభుత్వం "సమానత్వం - సాధికారత - స్వాభిమాన జీవితం" అనే లక్ష్యంతో అమలు చేస్తున్న కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విద్యా రంగంలో పోస్ట్ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్స్ కింద 574 కోట్ల రూపాయలు వెచ్చించి, మూడు లక్షల నలభై వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు.

డెస్క్

**వాకిటి**

జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ లో మూడు రోజుల పాటు జరిగిన ఖేలో ఇండియా-చింతన్ శివిర్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. క్రీడల్లో భారత్ ను గ్లోబల్ లెవెల్ లో అగ్రగామిగా నిలపాలని ఈ చింతన్ శివిర్ లో నిర్ణయించారు. క్రీడల అభివృద్ధికి కేంద్రం తీసుకునే నిర్ణయాలకు తెలంగాణ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి ఈ శిబిరంలో చెప్పారు. ఇప్పటికే క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసీ తీసుకొచ్చిందని ఆయన చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న ఖేలో ఇండియా నుంచి తెలంగాణకు అధిక నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయను మంత్రి కోరారు.

డెస్క్

**జనగణన - 2026**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి డిజిటల్ పద్ధతిలో చేపడుతున్న 8వ జనగణన - 2026 లో పౌరులు అపోహలకు తావివ్వకుండా విరివిగా పాల్గొనాలని వనపర్తి జిల్లా జనగణన అధికారి హరికృష్ణ కోరారు. ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ...

బైట్ : హరి కృష్ణ, జిల్లా జనగణన అధికారి, వనపర్తి

పిటిసి, వనపర్తి

**ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్**

నల్గొండలో ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్ పై జరిగిన దాడిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. దాడి ఘటనపై జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడి విచారణకు ఆదేశించారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేస్తే ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు.

డెస్క్

**బీఆర్ఎస్**

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్ లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, ఎమ్మెల్యేలు ఎంపీలు ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ భవన్ లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

డెస్క్

**బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం**

హన్మకొండ జిల్లాలోని పరకాలలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ పాలన దోహదపడిందన్నారు.

పిటిసి, వరంగల్

**మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ**

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణులు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించారు.

పిటిసి, మంచిర్యాల

**ఆసిఫాబాద్ - బీఆర్ఎస్**

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించగా, కాగజ్నగర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప జెండా ఆవిష్కరించారు.

పిటిసి, ఆసిఫాబాద్

**భద్రాద్రి కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి కొరత లేదని, ప్రజలు అనవసర భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల శాఖ అదనపు సంచాలకులు ప్రేమ్ కుమార్ తెలిపారు. జిల్లాలో మొత్తం 83 పెట్రోల్ బంకులు ఉండగా, అన్ని బంకుల్లోనూ పెట్రోల్, డీజిల్ సరఫరా సాధారణంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు అనవసరంగా భయాందోళనలకు లోనై ప్లాస్టిక్ కేన్లలో ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించడం వల్ల తాత్కాలికంగా కొన్ని చోట్ల ఇంధనం త్వరగా అమ్ముడవుతున్నదని చెప్పారు.

పిటిసి, భద్రాద్రీ కొత్తగూడెం

**వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించే ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి రాందాస్ సూచించారు. ఈరోజు నుంచి జూన్ 7 వరకు అథ్లెటిక్స్, కరాటే, యోగా, వాలీబాల్, హ్యాండ్ బాల్, నెట్ బాల్, ష టిల్ బాడ్మింటన్, ఆర్చరీ, కబడ్డీ, ఖోఖో క్రీడలలో శిక్షణ ఇస్తారు.

పిటిసి, సిరిసిల్ల

**జనగామ కలెక్టర్**

ధాన్యం కొనుగోలు ప్రక్రియ టోకెన్ పద్ధతి ప్రకారం నిర్వహించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. పెంబర్తిలో ఏర్పాటు చేసిన ఐకేపీ, పిఏసీఏస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈరోజు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.

పిటిసి, జనగామ

**మండుతున్న ఎండలు**

నల్లగొండ జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో నల్లగొండ నిప్పుల కొలిమిలా మారుతోంది. గత వారం రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలోని అడవిదేవులపల్లిలో 43.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయింది.

పిటిసి, నల్గొండ

**జనాభా గణన**

జనాభా గణన–2027లో భాగంగా వచ్చే నెల 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించినట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. ప్రజలు సెన్సస్ వెబ్ సైట్ ద్వారా కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చన్నారు.

పిటిసి, వరంగల్

**ఈఎంఆర్ఎస్ ఫలితాలు విడుదల**

ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ రమేష్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి విడతలో 40 మంది ఎంపికయ్యారని ఎంపికైన తెలియజేశారు.

పిటిసి, ఆసిఫాబాద్

**విదేశీ ఖైదీలు**

సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ హోం ఫర్ ఫారినర్స్ జైలులో విదేశీ ఖైదీలను రిమాండ్ చేశారు. వివిధ దేశాలకు చెందిన వారు పలు నేరారోపణల్లో దోషులుగా

ఉన్న 13 మందిని హైదరాబాద్ నుండి జోగిపేట ట్రాన్సిట్ హోం జైలుకు తరలించారు. ఖైదీల్లో 10 మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు.

పిటిసి, సంగారెడ్డి

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

రబీ సీజన్ లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

పిటిసి, సిరిసిల్ల